## కథాకేళి



# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## అయిదు రూపాయలు

ఆ రోజు ఆఫీసుకి వెళుతుంటే బస్ స్టాప్ ప్రక్కన కన పడ్డారు వాళ్ళు నాకు.

బిచ్చగాళ్ళు ఆ ముగ్గురు. తాత, కొడుకు, కోడలు అయివుంటారు. లేదా తండ్రీ, కూతురు, అల్లుడేమో? అస్థిపంజరానికి చర్మం చొక్కా వేసినట్లుగా వుంది ఆ యువకుడి నడుంపైనుంచి ఆచ్ఛాదన లేని శరీరం. కళ్ళల్లో చిన్నప్పుడే జిల్లేడు పాలు పిండి ఆమె కళ్ళని బిచ్చానికోసం హరించి నట్లున్నారు.

ఆ ముసలాడికి ఉబ్బసమో లేక టి.బి.నో ఊరికే ఆయాసపడిపోతు న్నాడు. ఓ పది పైసలు వాళ్ళవైపు విసిరేశాను. కృతజ్ఞతగా చూశాయి ఆ యువకుడి కళ్ళు.

ఎందుకో ఆ రోజంతా ఆఫీసులో నాకు ఆ ముగ్గురే గుర్తుకు రాసాగారు. వాళ్ళ పరిస్థితిలో నన్నూహించుకుంటే భయం వేసింది. ఎండకి, వానకి తల దాచుకోడానికి చోటు లేక, కాలకృత్యాలు తీర్చుకోడానికి లోకంకన్నా ముందే ప్రయివసీ కోసం లేచి, ఆ రోజు కడుపు నింపుకోడానికి సరిపడే డబ్బు బిచ్చంగా వస్తుందో రాదో అన్న భయంతో... అలా కొన్ని వేల రోజులు గడపడం ఎంత దుర్భరం!

"ఎన్.జి.ఓ. జీతం సంసారం ఈడ్చ డానికే సరిపోదు. ఇంక బిచ్చం వెయ్య డానికి కూడానా?" నవ్వింది మా పెద్ద మ్మాయి.

"అసలు తప్పు ప్రభుత్వానిది" చెప్పాడు చిన్న కొడుకు.

ఆ రోజు రాత్రి ఇంట్లో ఆ బిచ్చగాళ్ళ గురించి చెప్తే -

వాళ్ళలో నాకున్న స్పందనలో కొద్దిగా కూడా లేకపోవడం నాకు బాధేసింది. వాళ్ళకో అయిదు రూపాయలిస్తే అనిపిం చింది.

మర్నాడు ఆఫీసులో కూర్చుని ఆ నెల ఇంకా మిగిలి వున్న ఖర్చు ఎంతో లెక్క వేశాను. నా దగ్గర ఎంత మిగిలి వుందో పర్స్ తెరచి చూశాను.

అప్పటికే పద్దెనిమిది రూపాయిలు లోటు బడ్జెట్, ఇంక ఎలా ఇవ్వగలను?

సిగరెట్ మానదామంటే ప్రాణం గిలగిల లాడింది. నడచి వెళ్ళే టైం, ఓపిక దాటిన వయసాయె! మధ్యాహ్నం కాఫీ మానేస్తే కొలీగ్స్ నన్ను ఐ.పి. గాణ్ణను కోవచ్చు. మర్నాడు కూడా ఆ విషయం, అయిదు రూపాయిలు ఆ బిచ్చగాడి ఫ్యామిలీకి ఎలా ఇవ్వడం, అన్న సంగతి ఆలోచించాను.

ఆ సాయంత్రం ఆఫీసు నుంచి కాలి నడకన ఇంటికి బయలుదేరాను - బస్ ఫేర్ సేవ్ చేయవచ్చని. కొద్ది దూరం నడిచాక వెనకనుంచి స్కూటర్ హారన్ మోత వినిపించి తల తిప్పి చూస్తే మా ఆఫీస్ సూపరింటెండెంట్.

"బస్ దొరకలేదా?" అడిగాడాయన స్కూటర్ని నా పక్కన ఆపి.

"లేదండి, బాగా రష్‌గా వుంటేను"

"ఎక్కవయ్యా, మీ ఇళ్ళవైపే నే వచ్చేది" చెప్పాడాయన.

ఎక్కాను.

కొంత దూరం వచ్చాక ఆయన గణేష్ విలాస్ ముందు ఆపాడు స్కూటర్ని. నేను దిగాను. స్టాండ్ వేస్తూ చెప్పాడు -

"పదవయ్యా. కాఫీ తాగి పోదాం"

ఇద్దరం లోపలికి వెళ్ళాం. ఆయన్ని చూసి గుర్తుపట్టినట్లుగా నవ్వి చెప్పాడా వెయిటర్.

"సార్! ఇవాళ మీ కిష్టమైన టమోటా ఆమ్లెట్ వుంది!"

"ఓ. ఇవాళ బుధవారం కదా! రెండు చెప్పు" అని నావైపు తిరిగి "ఇక్కడ ప్రతి బుధవారం అదేస్తారు. రుచి అద్భుతం అనుకో" చెప్పాడు.

నిజంగానే బావుంది. జీడిపప్పు, కొత్తి మీర కనబడేలా పైన చల్లి తెస్తే ఎందుకు బాగుండదు?

ఆయన వాష్ బేసిన్‌కు చెయ్యి కడు క్కోడానికి వెళ్ళినప్పుడు వచ్చింది బిల్లు.

నాకు సెలవు సేంక్షన్ చేసే ఆఫీసర్ - మొహమాటం. ఆరు రూపాయిల ఇరవై పైసలు బిల్లు చెల్లించాను.

"అదేమిటోయ్. నేను పిలుస్తే నువ్వు ఇచ్చావా" చెప్పాడాయన నొచ్చుకుంటూ.

"ఫర్వా లేదండి" చెప్పాను మొహ మాటంగా.

"బానే వుందోయ్, ఇవాళ నా పుట్టిన రోజు తిథుల ప్రకారం. వచ్చే ఏడాది రిటైరయ్యేవాణ్ణి నాకు పుట్టిన రోజు లేంటి! దానికి నీకు పార్టీ ఇచ్చాననుకో."

బలవంతంగా ఆరు రూపాయిల ఇరవై పైసలు నా చేతిలో వుంచి ఇంటి దగ్గర దింపి వెళ్ళాడు. ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు నాకు.

ఆ బిచ్చగాళ్ళ కుటుంబం, వాళ్ళకి దానం చేద్దామని వున్నా, ఇవ్వడానికి నాకు కనబడని ఐదు రూపాయిలు, నా బడ్జెట్‌లో లేకపోయినా సూపరింటెం డెంట్ కోసం ఖర్చు చేసిన ఆరు రూపా యిల ఇరవై పైసలు నాకు కళ్ళు మూస్తే కనపడసాగాయి.

ఆ బిచ్చగాళ్ళకి డబ్బు ఇవ్వడానికి లేదనుకోవడం నా పిచ్చితనం. ఎంత వున్నా ఇంకా లేదు, చాలదని అనుకునే జీవితం ఎన్.జి.ఓ.ది అన్న రియలైజేషన్ వచ్చింది నాకు.

మర్నాడు ఉదయం ఆ బిచ్చగాళ్ళ కుటుంబానికి పది రూపాయిలు ఇవ్వాలి అని నిర్ణయించుకున్నాక నాకు హాయిగా నిద్ర పట్టింది.

మర్నాడు ఉదయం చేతిలో పది రూపాయ బిళ్లలతో బస్ స్టాప్‌కి నడిచాను. ఆ బిచ్చగాళ్ళు బస్ స్టాప్‌లో లేరు. ఆ రోజు నుంచి ఈ రోజుదాకా వాళ్ళు మళ్ళీ నా కళ్ళబడలేదు. ●





ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక 17-11-89